నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 30 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# కవ్వాల్‌లో సీతాకోకల కనువిందు





అటవీ శాఖ నర్సరీలో సీతాకోక చిలుకల ప్లాంటేషన్

- 70 రకాల జాతులున్నట్లు గుర్తించిన అధికారులు
- ఇటీవల అటవీశాఖ నర్సరీలో ప్లాంటేషన్ ఏర్పాటు
- పూల మకరందాన్ని జుర్రుతూ సందడి చేస్తున్న బటర్ ఫ్లైలు



జన్నారం, జూలై 29 : కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 70 రకాల సీతాకోక చిలుకల సందడి చేస్తుండగా, అధికారులు వాటి సంతానోత్పత్తి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇటీవల జన్నారం మండల కేంద్రంలోని అటవీశాఖ నర్సరీలో సీతాకోక చిలుకల ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఇందులో నాటిన తెలుకొండి, చిట్టిగిలిగిచ్చా, జంత్రోప, శంకు పుష్పం,లంటానా, రామబాణం, గడ్డిచామంతివంటి పూల మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. జాకర్, కెమ్‌సన్, డనైడ్‌ఎగ్‌ప్లే, సిగ్రిడ్స్, తరక్సానారవంటి సీతాకోక చిలుకలు పూలపై వాలి మకరంద్రాన్ని జురుతున్నాయి. మున్ముందు మరిన్ని జాతులు ఇక్కడికి వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. సీతాకోక చిలుకల సంతానోత్పత్తికోసం కావాల్సిన మొక్కలు పెంచినట్లు వారు తెలిపారు.

## జీవ వైవిధ్యంలో కీలకం



ప్రకృతికే కొత్త అందాల్ని తీసుకొచ్చే ఈ సీతాకోక చిలుకలు జీవివైవిధ్యం లోనూ కీలకంగా వ్యవహరిస్తాయి. వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కవ్వాల్ అడవుల్లో 70 రకాల సీతాకోక చిలుకల జాతులను గుర్తించాం. ఇటీవల ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌లోకి ఇప్పటి వరకు 25 రకాల సీతాకోక చిలుకలు వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని జాతులు వచ్చే అవకాశముంది.


- సుష్మా రావు, రేంజ్ ఆఫీసర్, జన్నారం



# స్థానికం కష్టమే..

## ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాల్లేవు..

- కోర్టు తీర్పు అమలు చేయాల్సి ఉంది..
- బీసీ కమిషన్ నివేదిక సమర్పించాకే నోటిఫికేషన్
- ఈ పనులు అయ్యేందుకు సమయం పట్టే చాన్స్
- ఆగస్టులో ఎన్నికలంటూ ప్రచారంతో అప్రమత్తమైన లీడర్లు
- జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచితేనే బీసీలకు మేలు
- సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు పెరగనున్న పోటీ
- ఎన్నికల కోసం ఎదురు చూపులు.. టికెట్ల కోసం పట్టు..




మంచిర్యాల, జూలై 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఆగస్టులో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ వస్తుందంటూ తెగ ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడిచింది. దీంతో ఆశావహులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూసుకుంటూ, ఎలాగైనా సర్పంచ్ లేదా వార్డు మెంబర్ టికెట్లు దక్కించుకోవాలనే పట్టుదలతో భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆగస్టులో ఎన్నికలు ఉండకపోవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2019లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే సమయంలో సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. ముందు బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. కాకపోతే అప్పటికప్పుడు బీసీ కమిషన్ ఈ ప్రక్రియ పూర్తి చేయలేదన్న ఉద్దేశంతో మినహాయింపు ఇచ్చి, ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ ఖరారును తప్పనిసరి చేసింది. బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడానికి నియమించిన కమిషన్ ముందు ట్రిపుల్ టెస్టు చేసి నివేదిక ఇవ్వాలి. అదయ్యాకే బీసీ రిజర్వేషన్లు ఫైనల్ చేసి ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. ఇప్పటి వరకు బీసీ కమిషన్ ఎలాంటి పనులు చేయపట్టలేదని తెలుస్తున్నది. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ మొదలుపెట్టినా అంతా పూర్తయి, ఎన్నికల దాకా రావాలంటే కనీసం రెండు నెలల సమయం పట్టనుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే ఆశలు పెట్టుకోకపోవడమే మంచిదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### కులగణన చేశాకే ఎన్నికలు నిర్వహించాలి..



రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలి. జనాభాలో సగం ఉన్న బీసీలు రాజకీయంగా అనాధిగా అణగదొక్క బడుతున్నాయి. పదవుల కేటాయింపుల్లో తీరని అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలి. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గేది లేదు. అవసరమైన ఉద్యమాలు చేసేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు.

- చంద్రమోహన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మంచిర్యాల.

### లోక్‌సభ ఓటరు జాబితా ప్రామాణికంపై వ్యతిరేకత

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితాను ప్రాతిపాదికగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘాన్ని లిస్టు ఇవ్వాలని కోరింది. తెలంగాణతోపాటు మరో ఐదు రాష్ట్రాలకు ఈ జాబితా ఇచ్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఓకే చెప్పింది. ఈ మేరకు కేంద్రం నుంచి అతి త్వరలోనే ఎన్నికల జాబితా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా.. ఈ ఓటరు జాబితాను ప్రతిపాదికగా తీసుకుని బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తే ఊరుకునేది లేదని ఇప్పటికే బీసీ సంఘాలు చెప్తున్నాయి. జనాభా ప్రతిపాదికన తీసుకునే రిజర్వేషన్లు ఫైనల్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మొండికేసి ముందుకెళ్తే న్యాయపరమైన చిక్కులు తప్పవనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కన్నా.. బీసీ కమిషన్ నివేదిక ఇచ్చాకే రిజర్వేషన్లు ఖరారు చేసుకుని న్యాయపరమైన చిక్కులు రాకుండా ముందుకెళ్తేనే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మొదలైన సందడి

ఆగస్టులో ఎన్నికలంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో గ్రామాల్లో సర్పంచ్ పదవుల సందడి మొదలైంది. ఆశావహులు అన్ని రకాల అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు ఏం చేయాలా అని ఆలోచనలు, చర్చలు గ్రామాల్లో జోరందుకున్నాయి. కొందరైతే చేస్తున్న ఉద్యోగాలు మానేసి మరీ ఎన్నికల కోసమంటూ ఊర్లకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామపంచాయతీలు ఉండగా, 12,703 వార్డులు ఉన్నాయి. దీంతో అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలుపుకుని వేలాది మంది మంది స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉండడంతో ఆశావహులు ఎక్కువయ్యారు. గ్రామంలో సర్పంచ్ టికెట్ బీసీలకు ఇస్తే ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది మంది వరకు పోటీలో నిలబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇది రాజకీయ పార్టీలకు తలనొప్పిగా మారనుంది. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ ఇబ్బందులు రానున్నాయి. ఇటీవల పార్టీలో చేరిన వారు, ఎప్పటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్న వారికి మధ్య తీవ్రమైన పోటీ ఉండనుంది. టికెట్ దక్కని నాయకుల అసమ్మతితో కొత్త చిక్కులు వచ్చిపడనున్నాయి. వీటన్నింటినీ సరి చేసుకునేందుకు చాలా సమయం అవసరం అవుతుంది. అందుకే ముందస్తు ఎత్తుగడలో భాగంగానే స్థానిక ఎన్నికలంటూ అధికార పార్టీ ప్రచారానికి తెరలేపిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నది. ఇప్పటికే అభ్యర్థుల విషయంలో పూర్తి క్లారిటీతో ఉన్న బీఆర్‌ఎస్ ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా దూసుకుపోయేందుకు సిద్ధం అవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల ప్రక్రియ ఎటుపోయి ఎటు తిరుగుతుందో చూడాలి మరి.



చింతలమాదర జలపాతం వద్ద మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో

## జలపాతం వద్ద నిబంధనలు పాటించాలి

### గిన్నేధరి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్

తిర్యాణి,జూలై 29 : చింతల మాదర జలపాతం వద్ద అటవీశాఖ, టూరిజం కమిటీ విధించిన నిబంధనలను సందర్శకులు తప్పకుండా పాటించాలని గిన్నేధరి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్, ఈటీసీ చైర్మన్ తుంరం గోపాల్ పేర్కొన్నారు. సోమవారం చింతలమాదర జలపాతాన్ని తిర్యాణి రేంజర్ శ్రీనివాస్‌తో కలసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే సందర్శించాలన్నారు. ఆ తర్వాత ఎలాంటి ఘటనలు జరిగినా తమ బాధ్యత ఉండదన్నారు. గతంలో జలపాతాల వద్ద జరిగిన ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈటీసీ,అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## తానియా సోని మరణం బాధాకరం

మంచిర్యాలటౌన్, జూలై 29 : ఢిల్లీ వరదల్లో మునిగి తానియా సోని మరణించడం బాధాకరమని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు విజిత్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ 1-గనిలో డీజీఎంగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ కూతురు తానియా సోని ఐఏఎస్‌లో సీటు సాధించడం కోసం ఢిల్లీలోని కోచింగ్ సెంటర్‌లో చేరగా, సెల్లార్‌లోకి వరద వచ్చి సోనితో పాటు మరో ఇద్దరు మృతిచెందిన ఘటన ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసిందని వారు అన్నారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



































వీకాఫిన్ యాప్ లో విద్యార్థులను జాయిన్ చేస్తున్న నిర్వాహకులు

## ఆశ చూపి.. బలి చేస్తూ

- కౌశల్ కేంద్రం నిర్వాహకుల కాసుల కక్కుర్తి
- వీకాఫిన్ యాప్‌లో చేరాలంటూ విద్యార్థులపై ఒత్తిడి
- పెట్టుబడికి రెట్టింపు సంపాదన వస్తుందని ప్రోత్సహిస్తున్న వైనం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 29 : జిల్లా కేంద్రంలోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం నిర్వాహకులు కాసుల కోసం కక్కుర్తి పడి విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్వాహకులు మాత్రం డబ్బుల కోసం ఆశపడి అడ్డదారులు తొక్కుతూ విద్యార్థులను బలి చేస్తున్నారు. వీకాఫిన్ అనే ఆన్‌లైన్ యాప్‌ను పరిచయం చేసి, అందులో ఒత్తిడి చేసి మరీ విద్యార్థులను చేర్పిస్తున్నారు. రూ. 580 నుంచి రూ. లక్ష దాకా పెట్టుబడి పెట్టవచ్చని, 45 రోజుల పాటు ప్రతి రోజూ డబ్బులు పొందవచ్చని, పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశచూపుతూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

### సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు

ఈ ఆన్‌లైన్ యాప్ మొత్తం గొలుసు సిస్టంలో నడుస్తున్నట్లు సమాచారం. మొదట జాయిన్ అయిన వారు తమకు తెలిసిన వారిని యాప్‌లో జాయిన్ చేస్తే.. జాయిన్ చేసిన వారికి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ యాప్‌లో సుమారు 250 నుంచి 500 మంది వరకు జాయిన్ చేపిస్తే... యాప్ నిర్వాహకులు రూ. 5 లక్షల విలువైన కారు బహుమతిగా ఇస్తున్నట్లు పలువురు తెలిపారు.. అయితే, కౌశల్ కేంద్రం విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో జాయిన్ అయ్యారు. దీంతో కేంద్రం నిర్వాహకులు ఇప్పటి వరకు రూ. లక్షల్లో సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతూ ఉందో అర్థం చేసుకోవచ్చు.

### గతంలోనూ ఇదే తరహాలో మోసం..

పీఎం కౌశల్ కేంద్రం నిర్వాహకులు నకిలీ వేలి ముద్రలు సృష్టించి సొమ్ము కాజేస్తున్నట్లు మార్చి 29న 'కౌశల్ కేంద్రంలో కాసుల కక్కుర్తి' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు అప్పటి కాంట్రాక్టర్, మొత్తం నిర్వాహకులు, ఉద్యోగులను తొలగించారు.

# రుణమాఫీపై అయోమయం

- రూ. లక్ష లోపు ఉన్నా మాఫీ కాలేదంటున్న రైతులు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఎవరిని అడగాలో తెలియక సతమతం
- కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని ఆవేదన



కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/సిర్పూర్-టీ, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ గందరగోళంగా మారింది. బ్యాంకుల్లో రూ. లక్ష లోపు రుణం తీసుకున్న అనేక మంది పేర్లు జాబితాలో లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. అన్ని అర్హతలున్నా రుణాలు మాఫీకాకపోవడంపై అయోమయానికి గురి చేస్తున్నది. రుణమాఫీ ఎందుకు కాలేదని బ్యాంకుల వద్దకు వెళ్తే.. తమకు తెలియదని, వ్యవసాయ అధికారులను అడిగితే ఏమోనని సమాధానాలిస్తుండడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలోని సిర్పూర్-టీ మండలంలోని ప్రాథమిక సహకార సంఘంలో మొత్తం 824 మంది రైతులుండగా, 388 మంది రైతులు రూ. లక్షలోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో ఎవరికి రుణ మాఫీ అయిందో.. ఎవరికి కాలేదో సహకార బ్యాంకు అధికారులకు కూడా సమాచారం లేదు. అలాగే తిర్యాణి మండలంలోని ప్రాథమిక సహకార సంఘం ద్వారా 538 మంది రైతులు రుణాలు తీసుకోగా, వీరిలో 462 మంది రైతులు రూ. లక్ష లోపు రుణం పొందిన వారున్నారు. వీరిలో కేవలం 197 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. మిగతా వారికి ఎందుకు కాలేదో తెలియడం లేదు. కౌటాల ప్రాథమిక సహకార సంఘంలో సుమారు 600 మంది రైతులు లక్షలోపు రుణాలు తీసుకున్న వారు ఉండగా, వీరిలో 349 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. ఇంకా 251 మంది రైతులకు ఎందుకు కాలేదో అధికారులకుగాని రైతులకు గాని తెలియడం లేదు... జిల్లాలోని 12 సహకార బ్యాంకుల పరిధిలో 10138 మంది రైతులకు రూ. 74 కోట్ల రుణాలు ఇచ్చారు. వీరిలో ఎంతమందికి మాఫీ అయిందో... ఎంతమందికి కాలేదో అంతుచిక్కడం లేదు. రుణమాఫీ ప్రక్రియ ఎలాంటి మార్గదర్శకాల ద్వారా చేశారో, తమకు రుణం ఎందుకు మాఫీ కాలేదో తెలియక రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### 1.22 లక్షల మంది.. 125.50 కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం జిల్లాలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు 1.22 లక్షల మంది ఉండగా, వీరికి రూ. 125.50 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. రూ. లక్ష లోపు పంటరుణం తీసుకున్న రైతులకు ఏక కాలంలో మాఫీఅయినట్లు రైతులకు సమాచారం ఇవ్వడంతో పాటు అధికారులకు కూడా సమాచారం ఇవ్వాలి. కానీ, రూ. లక్ష లోపు బ్యాంకుల్లో రుణాలున్న వారికి కూడా రుణమాఫీ కాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల బాటపడుతున్నారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో అర్థం కాక అధికారులను ఆశ్రయిన్నారు. లక్ష లోపు రుణం మాఫీ అయిన రైతుల జాబితాలో తమ పేర్లు ఎందుకు మిస్ అయ్యాయని రైతులు అడిగే ప్రశ్నలకు అధికారులు ఏమీ చెప్పలేకపోతున్నారు. ఎందుకు రుణం మాఫీకాలేదో బ్యాంకు వారికి తెలుసని వ్యవసాయ అధికారులు అంటుంటే. వ్యవసాయ అధికారులకు తెలుసని బ్యాంకు అధికారులు అంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.


### బ్యాంకోళ్లు తెల్వదన్నరు



నాకు జైనూర్ బ్యాంకులో రూ. 65 వేల పంటరుణం ఉంది. కానీ మొన్న మాఫీ కాలే. లిస్టులో కూడా నాపేరు రాలే. బ్యాంకుకు వెళ్లి అడిగితే మాకు తెల్వదన్నరు. రుణం మాఫీ అవుతుందని ఎంతో ఆశపడ్డ. గీ కాంగ్రెసోళ్లను ఎంతో నమ్మినం. కానీ గిట్ల చేస్తరనుకోలే. ఇకనైనా మాకు న్యాయం చేయాలే.

- కొడప నాగోరావ్, గూడమామడ, జైనూర్ మండలం

### చేస్తరో.. చేయరో..



నాకు వాంకిడిలోని స్టేట్ బ్యాంకులో రూ.లక్ష పంటరుణం ఉంది. రుణ మాఫీ జాబితాలో నా పేరు రాలే. వ్యవసాయయశాఖ అధికారులను అడిగితే తెల్వదని చెప్పిన్రు. తెలుసుకున్నాక చెబుతామన్నరు. పంట రుణం మాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ మమ్ముల మోసం చేసింది. మా ఆశలపై నీళ్లు చల్లింది. అసలు రుణం మాఫీ చేస్తరో.. చేయరో అర్థమైతలేదు.

- మర్సుకోల మల్కు, గూడమామ, జైనూర్ మండలం